క్లుప్తంగా

'మండల పరిషత్' గది వేలం

ఇల్లెందురూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న గదిని అద్దె ప్రాతిపదికన సోమవారం వేలంపాట నిర్వహించారు. ఏడాదిపాటు వాడుకునే అవకాశం కల్పిస్తూ నిర్వహించిన వేలంలో శ్యామ్ అనే వ్యాపారి నెలకు రూ.9 వేలు చొప్పున ఏడాదికి రూ.1.08 లక్షలతో దుకాణాన్ని కైవసం చేసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన వేలంపాటను ఎంపీడీఓ అప్పారావు, సీనియర్ అసిస్టెంట్ పార్వతి నిర్వహించారు.

గ్రంథాలయం కాంప్లెక్స్ గదులకు..

సుజాతనగర్: 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సుజాతనగర్ పంచాయతీ పరిధిలోని గ్రంథాలయం కాంప్లెక్స్‌లో ఉన్న నాలుగు దుకాణాలకు సంబంధించిన వేలంపాటను పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. సర్పంచ్ సీకా కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన వేలంపాటలో పలువురు పాల్గొనగా దుకాణాలకు నెలవారీ రూ.47,810 చొప్పున ఏడాదిలో రూ.5,73,720 ఆదాయం వీటీ కిరాయి రూపంలో పంచాయతీకి రానున్నట్లు పంచాయతీ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజామొహీనుద్దీన్ ఖాన్, ఎంపీటీసీ బత్తుల మానస, పంచాయతీ కార్యదర్శి బి.నరేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్స్ వితరణ

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురం పంచాయతీకి దేవినేని హేమలత జ్ఞాపకార్థం నల్లూరి స్వాతి, సూర్యభాస్కర్ దంపతులు(ఎన్ఆర్ఐ) ఫ్రీజర్ బాక్సును వితరణ చేశారు. సోమవారం సర్పంచ్ కట్రం మోహన్‌రావు, సెక్రటరీ బి.తిరుపతిరావులకు ఫ్రీజర్‌ను అప్పగించారు. ఉపసర్పంచ్ భూక్యా రవి, వార్డు సభ్యుడు కాజా రమేష్, గ్రామస్తులు వెంకట్రామ్, గోపాల్ రెడ్డి, నాగా శ్రీను, చావా వెంకటరామారావు, నాగయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సత్య

పాల్వంచ: హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ పట్టణ కన్వీనర్ కె.సత్య అన్నారు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో హమాలీ కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు హమాలీలకు అందడం లేదని, కార్మికుల భాగస్వామ్య లేకుండా తెలంగాణా పునఃనిర్మాణం జరగలేదన్నారు. నాయకులు గట్టయ్య, రాములు, వేణు, ఖాసీం, మల్లయ్య, సాయిలు, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ బానోత్ రమాదేవి ప్రారంభించారు. ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ బి.నానిబాబు, గ్రామస్తులు వెంకటేశ్వరరావు, చీమలపాటి భిక్షం, వెంకటరామారావు, జగన్నాథం, గురునాథం, పంచాయతీ సిబ్బంది లాలయ్య, రాజశేఖర్, గోపాల్‌రావు పాల్గొన్నారు.

జండాల తండాలో 'పాలిమేర' కట్టు



పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

టేకులపల్లి: మండలంలోని చింతలంక పంచాయతీ పరిధి జండాలతండా, చింతలంక తండాలో ఆంజనేయ స్వామి, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు సోమవారం పొలిమేర కట్టు నిర్వహించారు. పూజారులు, గ్రామపెద్దలు ఈ వేడుకలకు హాజరయ్యారు. తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరాం నాయక్, పూజారి వీరస్వామి, తేజ్యానాయక్, రాంబాబు, రాంజీ, జగ్యా, సక్రాం, హీరాలాల్, రవి, రమేష్, గంగు, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఉచిత వైద్య పరీక్షలు

పాల్వంచ: పట్టణంలోని శ్రీ భాగ్య హాస్పిటల్‌లో ముస్లింలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సురేశ్ పాధ్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింకు ఈనెల మొత్తం బీపీ, షుగర్, థైరాయిడ్, గైనకాలజీ, ఆస్తమా, ఎముకలు, కీళ్ల సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 వరకు అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

తండా నిండా సమస్యలే..!

రాజారాం తండా వాసులకు తప్పని ఇక్కట్లు

- పది వీధుల్లో ఒకచోటే సీసీ రోడ్డు
- చిన్నారులకు పాఠశాల కరువు
- అంగన్‌వాడీ కేంద్రం ఉన్నా భవనం లేదు



గ్రామంలో సీసీ రోడ్డుకు నోచుకోని వీధి



పాడైన డీపీ బోరు

టేకులపల్లి: మండలంలోని కొప్పురాయి పంచాయతీ పరిధిలో రాజారాం తండా ఏర్పడి సుమారు 70 ఏళ్లు అవుతోంది. ఇక్కడి ప్రజలంతా నిరుపేదలే వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్నారు. గ్రామంలో మొత్తం 55 నివాసాలు, 170 జనాభా ఉంటుంది. ఇక్కడ చదువుకునే చిన్నారులు ఉన్నా పాఠశాల లేదు. ఇక అంగన్‌వాడీ కేంద్రం ఉన్నా భవనం లేక ఇక్కట్లు ఎదురవుతునాన్నాయి. అలాగే, తాగునీటి అవసరాలకు రెండు చేతి బోర్లు, ఒకటి డీపీ బోరు వేయించగా.. ఒక చేతి బోరు వద్ద పెంట, చెత్త వేయడంతో వాడడం లేదు. అలాగే, డీపీ బోరు సైతం పాడు కాగా.. మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఇక ఇంట్రా పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడడంతో నీరు కలుషితమవుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉపాధి లేక పలువురి వలసలు..

గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో విద్యుత్ తీగలు లేకపోగా.. కొన్ని వీధుల్లో వీధి దీపాలు లేవు. గ్రామంలోని పది వీధులకు గాను ఒక వీధిలోనే 2020లో సీసీ రోడ్డు వేశారు. ఆ తర్వాత పట్టించుకున్న వారే లేరు. ఇక గ్రామంలో మచ్చుకైనా డ్రైయినేజీ కానరాదు. అన్ని అర్హతలు ఉన్నా పలువురు రైతులకు రెవెన్యూ, పోడు పట్టాలు ఇవ్వడం లేదు. గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు రాక అర్హులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పలువురి భూములను అటవీ అధికారులు తీసుకోవడంతో ఇక్కడి నుంచి ముప్పై కుటుంబాలు ఇతర ప్రాంతాలకు ఉపాధికి వెళ్లిపోయారు. ఇప్పటికైనా గ్రామంలో అనేక సమస్యలు పేరుకుపోయినందున పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు లేక అవస్థ పడుతున్నాం



గ్రామంలో పది వీధులకు ఒక చోటే సీసీ రోడ్డు వేశారు. దీంతో వర్షం పడితే వరద, బురదతో నడవలేని పరిస్థితి. సింగరేణి ప్రభావిత గ్రామమైనా రోడ్లు మంజూరు కావడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి అన్ని వీధులకు సీసీ రోడ్లు మంజూరు చేయాలి.

– భూక్యా లచ్చు, గ్రామస్తుడు

పోడు, రెవెన్యూ పట్టాలు ఇవ్వాలి



ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీ అధికారులు తీసుకున్నారు. మిగిలిన భూములకు రెవెన్యూ, పోడు పట్టాలు రావాల్సి ఉంది. అందరికీ డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలి. తద్వారా గ్రామం నుంచి వలసలను అడ్డుకోవడం వీలవుతుంది.

– గుగులోత్ రమేష్, గ్రామస్తుడు

సమస్యల పరిష్కారానికి కృషి



కొప్పురాయి జీపీ పరిధిలో 9 గ్రామాలు ఉండగా.. వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రాజారాంతండా గ్రామంలో రోడ్ల విషయాన్ని ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తా. తాగునీరు, వీధిలైట్ల సమస్యను వెంటనే పరిశీలించి పరిష్కరిస్తాం.

– చింత మంగమ్మ, సర్పంచ్, కొప్పురాయి

వర్తక, వ్యాపార సంఘాలకు అండగా ఉంటా..



ఎమ్మెల్యే వనమాను సన్మానిస్తున్న వ్యాపారులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని వర్తక, వ్యాపార సంఘాలకు ఉండగా ఉంటానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొత్తగూడెంలోని వర్తక, వ్యాపార సంఘాల వారు ఆయనను కలిసి మాట్లాడారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజు తగ్గించాలని వ్యాపారులు కోరగా, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి ట్రేడ్ లైసెన్స్ తగ్గింపునకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులంతా కలిసి ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కొత్తగూడెం. చిన్న బజార్, పెద్ద బజార్, వాణిజ్య, వర్తక, వ్యాపార వర్గాలకు చెందిన నాయకులు, ప్రతినిధులున్నారు.

ఏప్రిల్ 1 నుంచి ఆత్మీయ సమ్మేళనాలు



ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన లక్ష్మీపురం గ్రామస్తులు

ఇల్లెందు: సీఎం కేసీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి 13 వరకు నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే హరిప్రియ సోమవారం తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా ఎదిగిందన్నారు. ఆత్మీయ సమ్మేళనాలు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు కలిసి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల ముంగిటకు చేర్చాలని వారధిగా నిలువాలని కోరారు.

టేకులపల్లిలో పర్యటన...

టేకులపల్లి: ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ సోమవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు బాధితకుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, ఉపాధ్యక్షుడు చీమల సత్యనారాయణ, బాణోతు రామ, జాల మురళి, గుగులోత్ కృష్ణ, కరుణాకర్, అంతోటి రాకేష్, కాలె అభినయ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో పలువురి చేరిక

ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. టేకులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన 20 మందికి వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సర్పంచ్‌లు చింత మంగమ్మ, ఇర్ప లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ చింత శాంతకుమారి, నాయకులు పోతుగంటి వీరభద్రం, చింత వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, బొర్రయ్య, కుంజా రాఘవులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై స్పందించాలి



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జూలూరుపాడు: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తక్షణమే స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం జూలూరుపాడులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి, పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో అక్రమార్కులు నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులు పల్లె నుంచి పట్టణానికి ఉద్యోగమే ధ్యేయంగా వెళ్లిన వారి ఆశలకు ప్రభుత్వం గండికొట్టిందన్నారు. పేపర్ లీకేజీపై సీఎం కేసీఆర్ స్పందించి, లీకేజీపై హైకోర్టు సిటింగ్ జడ్జీతో విచారణ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాతలకు సత్కారం



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాల్వంచరూరల్: మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి, శాశ్వత దీప, ధూప నైవేద్యానికి విరాళాలు అందజేసిన దాతలను ఆలయ ట్రస్ట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సబ్ రిజిస్ట్రార్ కుమార్, ఆలయకమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి దురుసోజు వైకుంతనాథ్, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు కాపర్తి వెంకటచారి, వర్తకసంఘం కన్వీనర్ చలువాది ప్రకాశ్, వీరాచారి, రామచంద్రయ్య, తిరుపతి, బ్రహ్మరావు, శ్రీపాద సత్యనారాయణ, తుమ్మలపల్లి దామోదరాచారి పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పాల్వంచ: పోరాటాలతోనే ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని వికలాంగుల కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కామేశ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను విస్మరిస్తున్న అధికార పార్టీకి వ్యతిరేకంగా పోరాటం చేయడంలో వెనక్కి తగ్గేదిలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే నియోజక వర్గంలో సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. అనంతరం పలువురు బీఎస్పీలో చేరడంతో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు, పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణకుమార్, బొల్లేపోగు విజయ, వెంకటమ్మ, నాగమణి, కృష్ణవేణి, లీల, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామేశ్

కొనసాగుతున్న స్వచ్ఛతోత్సవ్



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధిలోని వార్డుల్లో స్వచ్ఛతోత్సవ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం 26వ వార్డులోని మహిళలకు తడి, పొడి చెత్తపై మున్సిపల్ శానిటరీ విభాగం అధికారులు అవగహన కల్పించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ అంబుల వేణు ఆధ్వర్యంలో స్వచ్ఛతోత్సవ్ ప్రతిజ్ఞను డ్వాక్రా మహిళాలు, స్థానిక మహిళలతో చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీరభద్రచారి, అశోక్, మెప్మా టీఎంసీ వెంకటేశ్వర్లు, సీఓ సరిత, మౌలాలీ, శాంతకుమార్, రిసోర్స్‌పర్సన్ తిరుపతి, శానిటరీ జవాన్ రవి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడిని కలిసిన నాయకులు



సుభాష్ పార్థికు బుద్ధ విగ్రహం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): నేషనల్ ఎస్సీ కమిషన్ సభ్యులు సుభాష్ పార్థిని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. సింగరేణిలో ఎస్సీల రోస్టర్ పాయింట్ వెరిఫికేషన్, ఎస్సీల పదోన్నతి తదితర అంశాలపై చర్చించేందుకు సోమవారం హైద్రాబాద్‌కు వచ్చిన ఆయన్ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లైజన్ ఆఫీసర్ కలవల నారాయణ, మాజీ జీఎం అందె ఆనందరావు, జీఎం దుర్గం రాంచందర్, సుధాకర్ రావు, ఏ.నాగేశ్వరరావు, కలవల చంద్రశేఖర్, జిమ్మిడి మల్లేష్, కనుకుల తిరుపతి, ఎంవీ రావు, ఇరుగురాళ్ల శ్రీనివాస్, మోరే రమేష్, ఎనగందుల వెంకటేశ్వర్లు, కేఎం.విక్టర్, మీసాల శ్రీహరి, కిరణ్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పాల్వంచరూరల్: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొనడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని సూరారం వైపు ద్విచక్రవాహనంపై సోమవారం వెళ్తున్న బూర్గంపాహడ్ మండలం పోలవరానికి చెందిన వంశీ రోడ్డు పక్కన చెట్టును ఢీకొని కింద పడ్డాడు. స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం కొత్తగూడెం తరలించారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

టేకులపల్లి: కొత్తగూడెంకు చెందిన ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, జామెంట్రి బాక్సులు, పెన్నులు, పెన్సిల్ వితరణగా అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ శ్రీకాంత్, టీచర్ శైలజ, బి.నాగేంద్ర, సుధీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ఇల్లెందు: అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

ఇల్లెందు: కౌమార దశలో బాలికల పెరుగుదల వేగంగా ఉంటుందని, ఈ దశలో పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ ఎం. లక్ష్మీ ప్రసన్న సూచించారు. సోమవారం ఇల్లెందు పట్టణంలోని జేబీఎస్‌లో కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లకు పోషణపక్వాడ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, సూపర్‌వైజర్ విజయ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పోషకాహారంతోనే తల్లి బిడ్డలకు ఆరోగ్యం చేకూరుతుందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పోషణ పక్షోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల పరిధిలోని జగన్నాథపురంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లతో అవగాహన సదస్సు నిర్వహించి గర్భిణులకు సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ కనకదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీడబ్ల్యూఓ స్వర్ణలతాలెనిన్, సర్పంచ్ అనిత, సొసైటీ డైరెక్టర్ చౌగాని పాపారావు, పీహెచ్‌సీ డాక్టర్ రాజు, జిల్లా పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ బాబు, ఏపీఎం రాంబాబు, డీసీపీఓ హరికుమారి, సూపర్‌వైజర్ వసంతరాణి, అనసూయ, వెంకటరమణ, అనురాధ, అశోక కుమారి పాల్గొన్నారు.

టేకులపల్లి: బాలికల్లో ప్రధానంగా రక్తహీనత సమస్య ఉంటుందని పోషకాహారంతో రక్తహీనత దూరం అవుతుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కాంపెల్లి మంగ తార అన్నారు. ఈ మేరకు సోమవారం టేకులపల్లి, సులానగర్ ఉన్నత పాఠశాలల్లో కిషోర బాలికలకు పీహెచ్‌సీ సిబ్బందితో రక్త పరీక్షలు చేయించారు. అనంతరం జరిగిన సమావేశంలో బాలికలకు వివిధ విషయాలపై అవగాహన కల్పించి ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొడెం అనురాధ, కుంజా సక్కుబాయి, కొమరం యశోద, గుర్రం శ్రీలక్ష్మీ, సీహెచ్‌వో సీతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.



పాల్వంచరూరల్: సామూహిక సీమంతం



టేకులపల్లి: ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ..

తునికాకు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కందగట్ల సురేందర్

ఇల్లెందురూరల్: తునికాకు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందగట్ల సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులో ఏర్పాటైన ఏఐకేఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏజెన్సీలో ఆదివాసీలు రెండోపంటగా భావించే తునికాకు సేకరణ కోసం మండుటెండల్లో శ్రమిస్తున్నా వారి శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదన్నారు. మృత్యువాత పడిన కార్మికులకు మెరుగైన ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పాడుగు నర్సింహారావు, సూర్నపాక నాగేశ్వరరావు, జోగ కృష్ణ, మధు, సీతారాములు, కోటమ్మ, సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, సంతు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'క్షయ'ను తరిమేయాలి



కిట్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఇల్లెందు: క్షయ వ్యాధిని పూర్తిగా తరిమి వేయాలని ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల సూపర్‌డెంట్ డాక్టర్ శిరీష్ కోరారు. సోమవారం ప్రభుత్వ హాస్పిటల్‌లో క్షయ రోగులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీబీ నిర్మూలనకు ప్రధానమంత్రి టీబీ ముక్త భారత అభియాన్ ప్రోగ్రాంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఎంపీ బండి పార్థసారథిరెడ్డి సహాయంతో కిట్లు అందజేయటం జరుగుతుందన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ జి. హర్షవర్ధన్, హెడ్ నర్స్ జగదాంబా, ఆయాలు, నర్సులు పాల్గొన్నారు.

మతోన్మాదం పెను ప్రమాదం

ఇల్లెందు: దేశంలో మతోన్మాద బీజేపీ వల్ల పెను ప్రమాదం పొంచి ఉందని, దీనికి వ్యతిరేకంగా యావత్ దేశం ఒక్కతాటి మీదకు వచ్చి పోరాడాలని సీపీఎం జిల్లా నాయకులు ఏజే.రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఇల్లెందులో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ...బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం, కార్పొరేటీకరణ కొనసాగిస్తోందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా వామపక్ష పార్టీలు కలిసి ఉద్యమిస్తున్నాయని, ఈ నెల 29న హైదరాబాద్‌లో నిర్వహించే జనచైతన్య యాత్ర సభను విజయవంతం చేయాలని కోరారు. అబ్దుల్ నబీ, కృష్ణ, సర్వన్, లక్ష్మీ, మోహన్‌రావు, రాందాస్, సుల్తానా, సంధ్య, వెంకటమ్మ, పద్మ, మరియ, రాము పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5న నిర్వహించనున్న చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న పిలుపునిచ్చారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్ సివిల్ కార్యాలయం ఎదుట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు కలెక్టర్ అభినందన



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న రాజశేఖర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మొక్కల రాజశేఖర్‌ను కలెక్టర్ అనుదీప్ సోమవారం అభినందించారు. సొంత ఖర్చుతో మొక్కలు నాటుతున్న రాజశేఖర్ తన 1000వ మొక్కను కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలు రాజశేఖర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూడ్ జయరాం, తెలంగాణ ఎంప్లాయిస్ జిల్లా జనరల్ సెక్రటరీ షేక్ దస్తగిరి, విభిన్న ప్రతిభావంతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మచ్చుకైనా కానరాని పచ్చదనం



ఇల్లెందు మండలం రాఘబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధి లక్ష్మీపురం శివారులో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. తొలినాళ్లలో ఉపాధి హామీ పథకం కూలీలకు నిర్వహణ బాధ్యత అప్పగించగా సాఫీగానే నడిపించింది. ఆతర్వాత వీరిని తొలగించి ప్రకృతివనం నిర్వహణ బాధ్యతలు గ్రామపంచాయతీ చేపట్టింది. అప్పటి నుంచి నీళ్లు లేక, నిర్వహణ లేక ప్రకృతివనంలో మొక్కలన్నీ ఎండిపోయి గ్రామస్తులకు ఆహ్లాదం దూరమైంది. – ఇల్లెందు రూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి, రాఘబోయినగూడెం
సెల్ నంబర్ :70939 23785